## ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన


రామచంద్రాపురం, డిసెంబర్ 2 : ప్రపంచ ఎయిడ్స్ డేను పురస్కరించుకొని భెల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెండ్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ డిప్యూటీ పారామెడికల్ అధికారి నాగభూషణం హాజరై విద్యార్థులకు హెచ్ఐవిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కొన్ని లక్షల మంది ఎయిడ్స్ బారిన పడి మరణిస్తున్నారని, ఎయిడ్స్ కారణంగా ఆర్థికనష్టం, కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం కావడం జరుగుతుందన్నారు. 1980లో ఎయిడ్స్ వ్యాధిని గుర్తించినప్పటికీ నేటికి వైరస్ శాశ్వ త నివారణకు మందును కనిపెట్టలేక పోతున్నామని తెలిపారు. కొన్ని రకాల మందులతో ఈ వ్యాధిని కంట్రోల్ చేస్తున్నామన్నారు. హెచ్ఐవి బారిన పడకుండా వైద్యుల సూచనలు ప్రతి ఒక్కరూ పాటించి ఎయిడ్స్ ని నిర్మూలించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖిత్ అంజూమ్, అధ్యాపకులు డాక్టర్ ఫర్హాత్, డాక్టర్ ఆర్‌విజికే మోహన్, డాక్టర్ జ్యోతీర్మయి, అసోసియేషన్ సభ్యులు విష్ణుప్రసాద్, జనార్దన్, బాలన్న, మల్లేశ్ పాల్గొన్నారు.



భెల్ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ వ్యాధిపై మాట్లాడుతున్న రిటైర్డ్ డిప్యూటీ పారామెడికల్ అధికారి నాగభూషణం

## విద్యాభివృద్ధికి ప్రజా ప్రతినిధి చేయూత

బొల్లారం, డిసెంబర్ 2: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆయగా పనిచేస్తున్న పద్మమ్మకు మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి స్వచ్ఛందంగా ముందుకొచ్చి రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని అందించి ఔదర్యాన్ని చాటుకున్నారు. ఆయాకు ప్రతినెల గౌరవ వేతనం అందజేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. విద్యాభివృద్ధికి తన సంపూర్ణ సహకారాన్ని ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు.


ప్రాథమిక పాఠశాల ఆయాకు స్వచ్ఛందంగా గౌరవ వేతనాన్ని అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్ కుమార్‌రెడ్డి

## ఆర్థికసాయం అందజేత

రామచంద్రాపురం, డిసెంబర్ 2: ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్ నగర్‌కాలనికి చెందిన కొండా గంగయ్య అనారోగ్యం కారణంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న పీఎన్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ యువజన నాయకుడు బూరుగడ్డ రాకేశ్‌రాజ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియలకు రూ. 5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు తమవంతు సహాయం అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నవీన్, మోహిన్, ఖాజ, మహేశ్ ఉన్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న బూరుగడ్డ రాకేశ్‌రాజ్

## మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం

సంగారెడ్డి అర్బన్, డిసెంబర్ 2: మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని శనివారం బీఆర్ఎస్‌వి జిల్లా నాయకుడు అఖిల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగ్జిట్‌పోల్ ఎగ్జిట్ అయిపోతాయని బీఆర్ఎస్ జైత్రయాత్ర కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం, సంగారెడ్డి నియోజకవర్గంలో చింతా ప్రభాకర్ ఎమ్మెల్యే కావడం ఖాయం అన్నారు. ప్రజలపై పూర్తి విశ్వాసం ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రఘు, రవి, వంశీ, హరిబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గెలుపుపై ఎవరి ధీమా వారిదే

జిన్నారం, డిసెంబర్ 2: శాసనసభ ఎన్నికల్లో తామే గెలుస్తున్నామని ప్రధానంగా మూడు పార్టీల నాయకులు ఎవరి ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పోల్ అయిన ఓట్లలో తమకు ఎన్ని వచ్చి ఉంటాయో లెక్కలు వేసుకుంటున్నారు. గ్రామాల వారీగా బలాబలాలను అంచనా వేస్తున్నారు. ఓటరు లిస్టు ఆధారంగా గ్రామాల్లో, మున్సిపల్‌లో, జీహెచ్ఎంసీ పట్టణాలలో బూత్‌ల వారీగా ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చి ఉంటాయో అని లెక్కలు వేస్తున్నారు. సైలెంట్ ఓట్లే పటాన్‌చెరు ఎమ్మెల్యే ఎవరనేది నిర్ణయిస్తుంది. ఈ ఎన్నికల్లో అన్ని పార్టీల్లో చాల వరకు క్రాస్ ఓటింగ్ జరిగింది. ఒక పార్టీలో తిరుగుతూ మరో పార్టీ కి ఓటు వేయాలని కొన్ని చోట్ల నాయకులు ఒంటరిగా వెళ్లి ఓటర్లకు చెప్పారు. జిన్నారం మండలంలో ఒక పార్టీ ఓటుకు ఐదు వందలు ఇస్తే మరో పార్టీ ఆరు వందలు ఇచ్చింది. ఇంకో పార్టీ వెయ్యి రూపాయలు పంచింది. మరో పార్టీ ఓటరు ప్రాధాన్యతను బట్టి మూడు నుంచి ఐదు వందలు, ఆరు వందలు పంచారు. తమ పార్టీ గెలుస్తున్నదని పందెం కడుతున్నారు.


ఓట్లు వేయాడానికి క్యూలో ఉన్న ఓటర్లు (ఫైల్)

**జయం మనదే.. నేటి ఫలితాలపై నాయకుల ధీమా**

బొల్లారం, డిసెంబర్ 2 : నేడు వెలువడనున్న అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్ పటాన్‌చెరు అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి విజయ దుందుభి మోగిస్తారని బొల్లారం మున్సిపాలిటీ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గులాబీ బాస్ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల స్వయంగా పార్టీ శ్రేణుల్లో కారు విజయంపై భరోసా కల్పించారు. బొల్లారం మున్సిపాలిటీ వ్యా ప్తంగా నేటి ఫలితాలపైనే జోరుగా చర్చలు, సమాలోచనలు జరగుతున్నాయి. ఎమ్మెల్యేగా గూడెం మహిపాల్‌రెడ్డి ప్రత్యర్థులను చిత్తుచేసి మరి విజయం సాధిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, బాల్‌రెడ్డి, పార్టీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి వేర్వే రు ప్రకటనల్లో తెలిపారు. మరోసారి సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి ఏర్పాటు కావడం ఖాయం అని కార్యకర్తల్లో ఉత్సహం నింపారు. ఎక్కడ చూసిన నేటి ఫలితాలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది.

## ఆన్‌జాబ్ శిక్షణతో ఉజ్వల భవిష్యత్

- **విద్యార్థులు శ్రద్ధగా శిక్షణను అలవర్చువాలి**
- **జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ**

రామాయంపేట, డిసెంబర్ 2: విద్యార్థులు క్రమ శిక్షణతో శిక్షణ పూర్తి చేస్తే ప్రభుత్వమే ప్లేస్‌మెంట్ కల్పిస్తుందని ఇంటర్ జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. రామాయంపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ ట్రైనింగ్ విద్యార్థులకు పలు విభాగాలలో శిక్షణ జరుగుతుంది. ఈ శిక్షణను బ్యాంకు, వైండింగ్ వర్క్స్ తదితర వాటి వద్ద శిక్షణ చేస్తున్న విద్యార్థుల వద్దకు శనివారం అధికారి సత్యనారాయణ వెళ్లి వారి చేసే పనులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒకేషనల్ ట్రైనింగ్ వల్ల మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. ఒకేషనల్ ట్రైనింగ్ చేసే సబ్జెక్టుపై ప్రత్యేకంగా దృష్టి పెడితే విజయం సాధిస్తారని, ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు ప్రాక్టికల్‌లో ఏ మాత్రం అశ్రద్ధ వహించినా భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంప్యూటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల డాటా ఎంట్రీని పరిశీలించారు. అధికారి వెంట రామాయంపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, మల్లేశం, బాబురావు, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.


కంప్యూటర్ శిక్షణను పరిశీలిస్తున్న నోడల్ అధికారి సత్యనారాయణ


## చెరువులోపడి యువకుడి మృతి


కుర్మ శ్రీహరి (ఫైల్)

అల్లాదుర్గ్, డిసెంబర్ 2: మండలంలోని అప్పాజిపల్లి గ్రా మానికి చెందిన ఓ యువకుడు శనివారం చెరువులో పడి మృతి చెందాడు. ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి కథనం ప్రకారం అప్పాజిపల్లికి చెందిన కుర్మ శ్రీహరి(25)గత నెల 30వ తేదీన జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు పలువురు గ్రామస్తులకు పోలింగ్ కేంద్రం వద్ద కనిపించాడని, అదే రోజు సాయంత్రం శ్రీహరి అదృశ్యమయ్యాడని తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చుట్టు పక్కల గాలించిన ఆచూకీ లభించలేదు. కాగా శనివారం ఉదయం గ్రామ సమీపంలోని గండి చెరువులో శ్రీహరి మృత దేహం కనబడింది. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి పెద్ద నాన్న కుర్మ నాగయ్య ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.


## నిరుపేద పెండ్లికి పుస్తెమెట్టెలు అందజేత

శివ్వంపేట, డిసెంబర్ 2 : మండలంలోని చండి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన మియ్యాడి ప్రవళిక వివాహానికి శనివారం పిల్లుట్లకు చెం దిన బీఆర్ఎస్ మండల కోశాధికారి బండారి గంగాధర్ సొంత ఖర్చులతో పుస్తె మెట్టెలను అందజేశారు.ఆయన వెంట చండి యువసేన అధ్యక్షుడు సురేశ్ ఉన్నారు.


పుస్తెమెట్టెలు అందజేస్తున్న గంగాధర్

## ఖాజీపల్లిలో అయ్యప్ప పడిపూజ

జిన్నారం, డిసెంబర్ 2 : ఖాజీపల్లిలోని పెద్దమ్మ ఆలయం వద్ద ఏర్పా టు చేసిన అయ్యప్ప సన్నిధానం ఆవరణలో సర్పంచ్ చిట్ల సత్యనారాయణ స్వామి శనివారం అయ్యప్పపడిపూజ నిర్వహించారు. శ్రావణ్ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన పద్దెనిమిది మెట్ల పడిపూజ, కలశ పూజ కన్నుల పండువగా జరిగింది. అయ్యప్ప పూజను వీక్షించేందుకు గడ్డపోతారం, నల్తూరు, జిన్నారం, ఊట్ల తదితర గ్రామాల నుంచి అయ్యప్ప మాలధారులు, గ్రామస్తులు భారీగా హాజరయ్యారు. అయ్యప్ప భజన పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల భార్గవ్, ఉపసర్పంచ్ బాలమణి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


ఖాజీపల్లిలో అయ్యప్ప పడిపూజ

## అనుమానాస్పదంగా వివాహిత మృతి

జిన్నారం, డిసెంబర్ 2: అనుమానస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన జిన్నారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వావిలాల గ్రామంలో శనివారం ఉదయం జరిగింది. తన కూతురు మృతిపై అనుమానం ఉందని తండ్రి కుమ్మరి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిన్నారం ఎస్ఐ విజయరావు కేసు నమోదు చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు...మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చండి గ్రామానికి చెందిన కుమ్మరి రాములు చిన్న కూతురు లావణ్య(మాధవి)(28)కి వావిలాల గ్రామానికి చెందిన కుమ్మరి చంద్రశేఖర్‌తో 2012లో పెళ్లి జరిగింది. వీరికి ముగ్గురు కొడుకులు ఉన్నారు. పెళ్లి అయినప్పటి నుంచి లావణ్య(మాధవి)ని ప్రతి చిన్న విషయానికి భర్త తిట్టడం, కొట్టేవారని ఇదే విషయమై పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి మాట్లాడారు. అయినా భర్త తీరులో మార్పు రాలేదు. సుమారు సంవత్సరం క్రితం మిరుదొడ్డి మండలం మోతే గ్రామ శివారులో 2-10 ఎకరాల భూమిని చంద్రశేఖర్ తన భార్య మాధవి పేరు మీద కొన్నాడు. కొన్ని రోజుల నుంచే ఆ భూమిని అమ్మాలని భార్యపై ఒత్తిడి తేవడంతో విషయాన్ని లావణ్యమాధవి తన తండ్రికి చెప్పింది. భూమి అమ్మొద్దని భర్తకు చెప్పడంతో అప్పటి నుంచి మానసికంగా శారీరకంగా వేధిస్తున్నాడు. డిసెంబర్ 2న ఉదయం పదిగంటల సమయంలో లావణ్య(మాధవి) చనిపోయినట్లు సోదరుడు కుమ్మరి ఆంజనేయులుకు ఫోన్ వచ్చింది. కుటుంబ సభ్యులందరూ వావిలాల వచ్చి చూడగా లావణ్యమాధవి నోట్లో నుంచి నురుగులు వచ్చి చనిపోయి కనిపించింది. లావణ్య మాధవి మృతి అనుమానాస్పదంగా ఉందని విచారణ జరిపించాలని తండ్రి కుమ్మరి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయరావు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు చెప్పారు.